సచివాలయ ఉద్యోగుల పోరు బాట

- సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్
- 22 తర్వాత తదుపరి కార్యాచరణ
- ఏలూరులో 500 మందికిపైగా ఉద్యోగులు



కమిషనర్ భాను ప్రతాప్‌కు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తోన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పోరుబాట పట్టారు. తమతో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారని, వేళాపాళా లేని విధులతో పని ఒత్తిడి పెరిగి పోతుందని వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక పేరుతో ఈ నెల 8 నుంచి 22లోగా 15 రోజుల్లోపు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు ముందస్తు సమాచారంతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. అప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్ కార్యాచరణను ఈ నెల 22 తర్వాత ప్రకటిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు.

కార్పొరేషన్‌లో 500 మందికి పైగా ఉద్యోగులు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 50 డివిజన్లు, వీటి పరిధిలో 79 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 500 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక జేఏసీ ఆధ్వర్యంలో నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు ముందస్తు వినతి పత్రం అందజేశారు. తమపై పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
- ఆరేళ్లపాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలి.
- అన్ని విభాగాల వారీగా ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలి.

ప్రధాన సమస్యలు

- ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖలకు అప్పగించాలి.
- సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయించరాదు.

పనిభారం తగ్గించాలి



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలి. వేళాపాళా లేకుండా వారికి పనులు కల్పించడం తగదు. వారి ఆత్మ గౌరవానికి భంగం కలుగని విధంగా విధులు కేటాయించాలి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరుపున సంఘీభావం తెలుపుతున్నాం.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర నాయకులు, ఏలూరు

సమస్యలు పరిష్కరించాలి



సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై అధిక పని భారం పెరిగింది. గతంలో వాలంటీర్లు చేసే ప్రతి పనీ నేడు సచివాలయ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

– ప్రత్తిపాటి తంబి, నగర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, ఏలూరు నగరం

క్లుప్తంగా

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, వారి కుటుంబాలకు సైతం ఎప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. మృతిచెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రరావు సతీమణి గౌరమ్మ, కుమారుడు శ్రీకాంత్‌కు కోఆపరేటివ్ నుంచి వచ్చిన రూ.1,02,413 చెక్కు రూపంలో ఎస్పీ శివకిషోర్ శుక్రవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు సకాలంలో అందేలా, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఆర్ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సేవకు కొలమానం అవార్డు



ప్రసాద్‌ను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

దెందులూరు: మానూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందటం ఆయన విధి నిర్వహణ సేవకు గుర్తింపుతో పాటు బాధ్యతలు పెంచుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తాఫ్ అలీ, ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవి కుమార్ అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం మానూరు పాఠశాలలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు సంయుక్త ఆధ్వర్యంలో తేరా ప్రసాదును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రంగమోహన్, మోహన్‌రావు, కె.కమల్ కుమార్, తేరా రాజేష్, తేరా దేవ సుందరం, జయప్రకాష్ ఆరవల్లి రవికుమార్, మాజీ ఏఎంఓ ఎ.శ్రావణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు డాక్టరేట్



రత్నకుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఈవీ రత్నకుమార్‌కు తమిళనాడుకు చెందిన అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. రత్నకుమార్‌ను కళాశాల చైర్మన్ వి.రాఘవేంద్రరావు, ప్రిన్సిపాల్ పి.బాలకృష్ణ ప్రసాద్ తదితరులు అభినందించారు.

అన్నార్తులను ఆదుకోవడమే నిజమైన భక్తి



అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న జేపీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలోని అన్నార్తులను ఆదుకోవడమే దేవునిపట్ల చూపే నిజమైన భక్తి అని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. స్థానిక 40 వ డివిజన్ తుమరాడ వారి వీధిలో వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని టీఎస్ఎన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నదాన కార్యక్రమాల ద్వారా సమాజంలో సమానత్వ భావన పెంపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నెరుసు చిరంజీవులు, జాన్ గుర్నాథ్, తుమరాడ స్రవంతి, కొల్లిపాక సురేష్ బాబు, దాలి వెంకటేష్, సముద్రాల చిన్ని, ఎర్రసూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ విద్య అవసరం



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న సెట్‌వెల్ సీఈఓ ప్రభాకరరావు

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలని సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర రావు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణలో 35వ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం స్థానిక అన్నే భవనంలో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన 25 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం 1180 మందికి కంప్యూటర్ శిక్షణ ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఉపాధికి తోడ్పడే విధంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఇచ్చే ఎమ్మెస్ ఆఫీసు, డీటీపీ, ఫొటోషాప్, ట్యాలీ కోర్సుల శిక్షణను అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎమ్మెస్ ఎన్ లక్ష్మి స్వాగతం పలికారు. కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. కేంద్రం కమిటీ సభ్యులు ఎస్ కస్తూరిరావు, పి.ఆంజనేయులు, మేతరాజబాబు, కొమ్మోజు శ్రీనివాసరావు, వై.నిర్మల పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన అదనపు ఎస్పీ, డీఎస్పీ

ఏలూరు టౌన్: స్థానిక శనివారపుపేట ప్రభుత్వ వసతి గృహాన్ని ఏలూరు మహిళా స్టేషన్ సీఐ, శక్తి టీమ్ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఒక్కో బాలుడు, బాలికను వారి కుటుంబ విషయాలపై ఆరా తీస్తూ ఉండగా, ఒక బాలుడు తన ఇంటి అడ్రస్, తల్లిదండ్రుల పేర్లు చెప్పడంతో వెంటనే స్పందించిన సీఐ సుబ్బారావు ఆచూకీ తెలుసుకున్నారు. బాలుడ్ని అప్పగించటంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేవు. ఆ వివరాలను అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. వసతి గృహంలో ఉన్న ఇబ్రహీమ్ అనే బాలుడు హైదరాబాద్ బోరబండ రైల్వేస్టేషన్ సమీపంలో చాంద్‌బీ మసీదు వద్ద ఉంటామని, తండ్రి పేరు అక్రమ్ అని చెప్పాడు. పోలీసులు బాలుడు చెప్పిన అడ్రస్‌ను ట్రేస్ చేసి తల్లిదండ్రులను గుర్తించారు. రెండేళ్ల క్రితం బాలుడు ఇంటినుంచి బిస్కెట్ కోసమని బయటకెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఈ కేసును అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి క్రైమ్ నెంబర్ 170/2023గా నమోదు చేశారని అక్కడి పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, బాలుడు తల్లిదండ్రులు ఏలూరు రాగా వారికి ఇబ్రహీమ్‌ని అప్పగించారు.

హామీలను విస్మరించిన ‘కూటమి’



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికలకు ముందు అధికారంలోకి రావటానికి కూటమి నాయకులు ఆటో, మోటార్ కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యూవీ), జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావులు డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక జూట్ మిల్లు సెంటర్లో ఆటో కార్మికుల నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూవీ, బద్దాలు మాట్లాడుతూ మోటార్ కార్మికులపై పెనాల్టీలు విధించే జీఓ 21 రద్దు, వాహన మిత్ర సాయం రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు పెంపు, సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి ఎన్నికల హామీలను కూటమి నాయకులు గాలికి వదిలేశారని వారు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వటానికి తాము వ్యతిరేకం కాదని, దానివల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం సభలో వాహన మిత్రను రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ, వాహన మిత్ర అమలు చేసే కార్మికుల సంఖ్యను దారుణంగా తగ్గించేశారని, సొంత ఆటో డ్రైవర్లకు మాత్రమే ఇస్తానని చెప్పటం ద్వారా లక్షలాదిమంది కార్మికులకు వాహన మిత్ర ఫలితం అందదని వాపోయారు. ఈ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 18న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏలూరు గూడ్స్ షెడ్ ఆటో కార్మిక సంఘం ప్రెసిడెంట్ పి.మహేష్, సెక్రటరీ కె.శివ, కమిటీ సభ్యులు బి.మురళి, ఆర్ పూర్ణ, ఎస్.శ్రీనివాస్, పి. వెంకటేష్, పి.పెద్దిరాజు, జి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు, ప్రశంసలు

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహనకు 5కె మారథాన్ ర్యాలీ విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలను కె.వెట్రిసెల్వి అందించి అభినందించారు. బాలుర విభాగంలో పవన్ (ప్రభుత్వ జూనిర్ కళాశాల కోట దిబ్బ, ఏలూరు) బాలికల విభాగంలో ఆర్ నాగమణి (ప్రభుత్వ వ్యాయమ కళాశాల), ట్రాన్స్‌జెండర్ విభాగంలో సీహెచ్ సన్నిధిలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు చొప్పున, బాలుర విభాగంలో జి.వెంకట లోకేష్ (ఆదిత్య జూనియర్ కళాశాల), బాలికల విభాగంలో కె.రమ్య దుర్గ భవాని (ప్రభుత్వ వ్యాయామ కళాశాల గోపన్నపాలెం), ట్రాన్స్‌జెండర్ విభాగంలో సంయుక్తలకు ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు చొప్పున, బాలుర విభాగంలో ఆర్ దినేష్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల), బాలికల విభాగంలో ఎన్ స్వాతి (సర్ సీఆర్ఆర్ ఉమెన్స్ కాలేజీ) తృతీయ బహుమతిగా రూ.5 వేలు చొప్పున, ప్రశంసా పత్రాలను కలెక్టరు అందజేశారు. ఎయిడ్స్ బాధితులకు ప్రేమా ఆప్యాయతలను పంచాలని, రక్త మార్పిడి, శస్త్ర చికిత్సల సమయంలో ఎయిడ్స్ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీజే అమృతం, సెట్ వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు, ఆర్ఐఓ ప్రభాకర్, డీఎల్ఏటీఓ నరేంద్ర, దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరు జి.ఆదిలింగం తదితరులు పాల్గొన్నారు.

16న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ సూచనల మేరకు జిల్లాస్థాయి వారధి ఇండియా ఫౌండేషన్ పోటీలు ఈనెల 16న మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని ఈదర సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్‌లలో ప్రథమ స్థానం పొందిన టీం సభ్యులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వాట్ రోల్ షుడ్ స్కూల్స్ ప్లే ఇన్ ప్రమోటింగ్ మెంటల్ హెల్త్ లేదా వాట్ ఆర్ ది త్రీ మోస్ట్ ఇంపార్టెంట్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆఫ్ ద యూఎన్ ఇన్ ద కాన్‌టెక్స్ట్ ఇండియా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సోషల్ మీడియా ఈజ్ ఏ యూజ్‌ఫుల్ టూల్ ఫర్ స్టూడెంట్ లెర్నింగ్ లేదా సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆఫ్ ద యూఎన్ ఆర్ నాట్ రిలవెంట్ టూ ఇండియాస్ డెవలప్‌మెంట్ అనే అంశంపై జిల్లా స్థాయి డిబేట్ పోటీలు ఉంటాయని వివరించారు. పై అంశాలలో టీం సభ్యులు ఏదో ఒక అంశాన్ని ఎన్నుకోవచ్చునని, డిబేట్‌లో ఎంచుకున్న అంశాలను సమర్థించడం గాని లేదా వ్యతిరేకించడం గాని చేస్తూ మాట్లాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను తీసుకువచ్చేటప్పుడు, గైడ్ టీచర్స్ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్ మెన్‌లకు జీఓ నంబర్ 7 ప్రకారం కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈనెల 15న సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు స్కూల్స్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్మెన్ల యూనియన్ అధ్యక్షులు పి.దుర్గ, గొసియా, చలమల విజయలక్ష్మి, జి.రాజులు తెలిపారు. ఈ ధర్నాలో ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన స్కూల్స్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్ మెన్లు అందరూ పాల్గొనాలని కోరారు.

హెల్త్‌ఫస్ట్ 1991 యాప్‌లో సీఆర్ఆర్ భాగస్వామ్యం



సీఆర్ఆర్ ప్రతినిధులకు ప్రశంసా పత్రం అందిస్తున్న రాజశేఖర బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విజయవాడ సిటీ పోలీస్ హెల్త్‌ఫస్ట్ 1991 రూపకల్పనలో తమ విద్యార్థులు భాగస్వాములు కావడం తమ కళాశాలకు గర్వకారణమని సీఆర్ఆర్ కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి సభ్యుడు కొండా హరిరామ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు సూచనల మేరకు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు హెల్త్‌ఫస్ట్ 1991 యాప్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ యాప్ అభివృద్ధి ప్రక్రియలో 1991 బ్యాచ్ పోలీసులు, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ హరి కృష్ణ ఆధ్వర్యంలో సీఆర్ఆర్ ఇంజినీరింగ్ బీటెక్ విద్యార్థులు, ప్రముఖ వైద్యులు, 26 ప్రముఖ ఆసుపత్రులు భాగస్వాములయ్యారని వివరించారు. ఈ యాప్ ద్వారా ఉచిత కన్సల్టెన్సీ, 20 నుంచి 30 శాతం వరకు చికిత్స రాయితీలు, అపాయింట్‌మెంట్ బుకింగ్ సౌలభ్యం అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ యాప్‌ను విజయవాడలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ తమ విద్యార్థులను, ప్రొఫెసర్లను ప్రత్యేకంగా అభినందించారని పేర్కొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి చర్యలు



వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: వయో వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. వయోవృద్ధుల పట్ల చోటుచేసుకుంటున్న దారుణ సంఘటనలు, అమానుష ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలు ఉన్నా ఎవరూ పట్టించుకోవటం లేదని, బాధితులకు న్యాయం జరగటంలేదని కోరారు. దీనిపై అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ వృద్ధులపై దాడులు, దౌర్జన్యాలు, కుటుంబ సభ్యుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో చైతన్యం రావాలని, ప్రతి వ్యక్తి తమ తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమ అప్యాయతతో ఉండాలనే భావన పెరగాలని అన్నారు. వృద్ధులకు సంబంధించి మెయింటినెన్స్, వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007, ప్రొటెక్షన్ ఆఫ్ విమెన్ ఫ్రమ్ డొమెస్టిక్ వయోలెన్స్ యాక్ట్ 2005 (వృద్ధ మహిళలకు) సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567 విధిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వృద్ధులు సురక్షిత జీవనాన్ని గడిపేందుకు ఇలాంటి చట్టాలు దోహదపడతాయని తెలిపారు.

ఉపాధ్యాయుల రణభేరి పోస్టర్ విడుదల

చింతలపూడి : ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్రమంతటా నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్, యర్రగుంటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు రణభేరీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభలో ఉపాధ్యాయుల సత్తా చూపుతామని అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	38	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	52	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	76-96
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26-30	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	34